



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026




## ఖమ్మంలో ఆలయ నిర్మాణం

# దైవ సంకల్పమే..





-ధర్మ మార్గంలో పయనించాలి
-ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభ
-శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ
-హాజరైన చిన్న జీయర్ స్వామి,
టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కలియుగ దైవమైన శ్రీనివాసుడు భూమిపై అడుగుపెట్టింది ఆశ్వీయుజ మాసం సోమవారం నాడు అని ఖమ్మంలో కూడా శ్రీవారి ఆలయానికి సోమవారం శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని స్వామి వారి అనుగ్రహానికి నిదర్శనమని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లిపురం రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో


మిగతా 2లో..


## సంస్కృతి ప్రతిబింబించేలా

# బతుకమ్మ వేడుకలు

-అవినీతికి తావులేకుండా అర్హులకు లబ్ది చేకూర్చాలి
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఆత్మగౌరవం ప్రతిబింబించేలా జిల్లాలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ బతుకమ్మ ఏర్పాట్లు, ఇందిర మహిళా డెయిరీ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల్లో ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలని మండలాల వారీగా పక్క ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, నిమజ్జనం వద్ద గజ ఈతగాళ్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా మహిళల ఆరోగ్యం,


మిగతా 2లో..


# నిలువునా చీలిన వైరా కాంగ్రెస్



-ఐదుగురు హాజరు..
ఏడుగురు గైర్హాజరు
-శాసన సభ్యుడు హాజరైనా
రాని కౌన్సిలర్లు
-సమావేశం తర్వాత
మరింత తీవ్రమైన వర్గపోరు

ప్రజాపక్షం/ఖమ్మం : వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. స్థానిక శాసన సభ్యుడు హాజరైన మున్సిపల్ ఛైర్ పర్సన్ వ్యవహార శైలిని నిరసిస్తూ ఏడుగురు కౌన్సిలర్లు హాజరు కాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.... వైరా మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ వ్యవహార శైలిని నిరసిస్తూ ఇటీవల అధికార పక్ష కౌన్సిలర్లు బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో గడిచిన రెండు నెలలుగా మున్సిపల్ సమావేశం జరగడం లేదు. మున్సిపల్ సమావేశ కాలపరిమితి ముగుస్తుండడంతో సోమవారం మున్సిపల్ సమావేశాన్ని


మిగతా 2లో..




# ఖమ్మంలో ఆలయ నిర్మాణం దైవ సంకల్పమే







(మొదటిపేజీ తరువాయి) నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమిపూజ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం నగరంలో టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభ ప్రదమన్నారు. దేశంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా అన్ని వర్గాల ప్రజలు ముందుగా భగవంతున్ని స్మరించుకుంటారన్నారు.



హిందూ ధర్మ పరిరక్షణ కోసం టిటిడి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఖమ్మం నగరానికి విచ్చేందుకు నేడు తొలి అడుగు పడిందన్నారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం రామానుజాచార్యుల వారి కాలంలో ఏర్పాటైన సాంప్రదాయం ప్రకారం వారంలోని వివిధ రోజుల్లో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించే విధానం కొనసాగుతుందన్నారు. ఈ సాంప్రదాయాల వెనుక భగవంతుని ఆరాధన, ఆధ్యాత్మిక భావన భక్తుల విశ్వాసం ఉన్నాయన్నారు. మన దేశం మన ధర్మం ప్రపంచానికి ఆదర్శమన్నారు. అందరు బాగుండాలని కోరుకునే వసుదైక కుటుంబ భావన మన ఆశయం అన్నారు. 10 మందికి మేలు జరగాలని కోరుకునే వారంతా మన వారేనని ఇతరులకు హానీ కలగాలని కోరుకునే వారు శత్రువులుగా మారుతున్నారన్నారు. ప్రజలంతా ధర్మ మార్గాన్ని అనుసరించేలా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రేరణ నిస్తుందన్నారు. ఆలయాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సమాజశ్రేయస్సు వంటి విలువలను ప్రజల్లో పెంపొందించే కేంద్రాలుగా నిలవాలన్నారు. శ్రీరాముడు, శ్రీ వెంకటేశ్వర స్వామి మధ్య విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందన్నారు. ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులంతా తమవంతు సహకారం అందించాలని చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. ప్రతి భక్తుడు ఒక ఇటుక ఇచ్చిన ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం అయినట్లే అన్నారు.

**ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభ : మంత్రి తుమ్మల**

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. టిటిడి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు, టిటిడి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో భద్రాచలం ఆలయ పనులకు చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టామని ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. నేడు వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందన్నారు.

**ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి : టిటిడి ఛైర్మన్**

ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఎంతో కీలకమన్నారు. దేశ వ్యాప్తంగా టిటిడి ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాబోయే ఏడాది కాలంలో ఐదువేల ఆలయాలను నిర్మించాలనే ప్రణాళిక ఉందన్నారు. అలిపిరి వద్ద రూ. 2,700 కోట్లతో సమగ్ర టౌన్‌షిప్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని రద్దీ సమయాల్లో సుమారు 20వేల మందికి వసతి కల్పించేలా టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలతో పాటు తెలంగాణలో ముఖ్యమంత్రి నియోజక వర్గమైన కొడంగల్, ఖమ్మం, కరీంనగర్‌లోనూ ఆలయ నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. టిటిడి నిబంధనల ప్రకారం ఆలయ నిర్మాణానికి 25 శాతం నిధులు స్థానిక భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని కేటాయించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి పలువురు విరాళాలు అందజేశారు. ఎంపి బండి పార్థసారధిరెడ్డి రూ. 60 లక్షలు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర రూ. 50 లక్షలు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ రూ. 25 లక్షలు, భోజన ఏర్పాట్లు చేసిన కుమ్మరికుంట్ల శ్రీనివాసరావు రూ. 11 లక్షలు విరాళంగా అందజేశారు. భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో శరత్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఎంఎల్‌ఎలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, నాయకులు తుమ్మల యుగంధర్, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, నాయకులు పాల్గొన్నారు.

## అటవీ ఫల సముదాయాల కేరాఫ్ అడ్రస్ భద్రాద్రి ఏజెన్సీ

- అడువులే ఆదివాసీల జీవనాధారం
- అటవీ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధికి అవకాశాలు
- ఐటిడిఏ చొరవ మరింత అండ



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాద్రికొత్తగూడెం జిల్లా అటవీ సంపదకు సహజసిద్ధమైన అటవీ ఫల సముదాయాలకు పెట్టింది పేరు. దట్టమైన అడవులు గిరిజన గ్రామాలు కొండ కోనలు నదులు సెలఏర్లు ఆదివాసీలకు జీవనాధారంగా నిలుస్తున్నాయి. సీజన్ల వారీగా లభించే చింత పండు, ఉసిరికాయలు, కరక్కాయలు, అడవిచీపురు ముడిసరుకు ఇప్ప పూలు ఇప్పగింజలు తునికాకు ఇతర అటవీ ఉత్పత్తులు గిరిజన కుటుంబాలకు ఆదాయ వనరుగా ఉన్నాయి. అటవీ ఫలాల సేకరణతో పాటు వాటిని శుభ్రపరచడం నిల్వచేయడం విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా మరింత ఆదాయం పొందే అవకాశం ఉంది. అయితే మధ్య వర్తులలపై ఆధారపడకుండా గిట్టుబాటు ధరలు లభించడం సేకరించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలే అత్యంత కీలకం.

**ఐటిడిఏ, జిసిసి గిరిజనులకు చేయూత...**

అటవీ ఉత్పత్తులు సేకరణ కొనుగోలు మార్కెటింగ్‌లో గిరిజన సహకార సంస్థ (జిసిసి) కీలక పాత్ర పోషిస్తుంది. భద్రాచలం గుండాల మణుగూరు ప్రాంతాల్లో ఇప్పపూలు ఇప్పగింజలు చింతపండు ఆధారంగా గిరిజనులకు ఆదాయం అవకాశాలున్నాయి. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఐటిడిఏ ఆధ్వర్యంలో అటవీ ఉత్పత్తులకు విలువజోడించి నిల్వ సదుపాయాలు శిక్షణ మార్కెటింగ్ అవకాశాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. అటవీఫలాలతో పచ్చళ్లు పొడులు సహజ ఉత్పత్తులు ఇప్పటికే తయారు చేస్తున్నారు. తద్వారా గిరిజనులకు ఆదాయం సమకూరుతోంది.

**అడవిని కాపాడుకుంటూనే ఆదాయం..**

సహజసిద్ధమైన అడవులను కాపాడుకుంటూనే ఆదాయం పెంచుకోవం ఈ ప్రాంత గిరిజనులకు జొన్నతో పెట్టిన విద్య అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పారదర్శకన కొనుగోళ్ల విధానం నిరంతర మార్కెటింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే భద్రాద్రి జిల్లా ఏజెన్సీ అటవీసముదాయాలు గిరిజనాభివృద్ధికి బలమైన పునాదులుగా నిలుస్తాయి.

**ఐటిడిఏ చొరవ...**

సహజనసిద్ధంగా అడవుల్లో లభించే ఫల సముదాయాల ద్వారా గిరిజనులకు మరింత ఆదాయ వనరులు కల్పించేందుకు ఐటిడిఏ శ్రీకారం చుట్టింది. కొండప్రాంతాల్లో అతి సులువుగా పండే రాగులు, జొన్నలు సజ్జలు ఈదలు అరెకల ద్వారా మిల్లెట్ బిస్కెట్స్ తయారు చేసి విక్రయాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. దేశప్రధాని నరేంద్రమోడి మన్‌కీ బాత్‌లో కార్యక్రమంలో ఐటిడిఏ ద్వారా తయారైన మిల్లెట్ బిస్కెట్లపై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. ఐటిడిఏ పిఓ రాహుల్ ప్రత్యేక చొరవతీసుకుని భద్రాచలం కేంద్రంగా భద్రగిరి మార్ట్‌ను ఏర్పాటు చేసి సహజ ఉత్పత్తులతో పాటు అటవీ ఫలసముదాయాలు ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. గిరిజన మహిళా సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ముడిసరుకుల ద్వారా ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. వీటికి అన్‌లైన్ సదుపాయాన్ని కల్పించడంతో పాటు విస్తృత ప్రచారాన్ని ఇస్తున్నారు. గిరిజనాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సహజఉత్పత్తులు గిరిజనుల జీవితాల్లో మరింత ఆర్థికవెలుగులు నింపాలని పలువురు ఆశిస్తున్నారు.

## సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు

**(మొదటిపేజీ తరువాయి)** కౌమర బాలికల సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందిరా మహిళ డెయిరీకి సంబంధించి అర్హులకు లబ్ది చేకూర్చే ప్రక్రియలో ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అవినీతి జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. లబ్దిదారులకు సోలార్ రూఫ్ టాప్‌తో కూడిన షెడ్లు, పశుగ్రాసం తదితర అంశాలతో కూడిన సమగ్ర ప్యాకేజీని సిద్ధం చేయాలన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 18న పెవిలియన్ మైదానంలో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు, కూడళ్లలోనూ వేడుకల వాతావరణం కనిపించేలా చూడాలన్నారు.బాలికల సంరక్షణపై అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిలువునా చీలిన వైరా కాంగ్రెస్

**(మొదటిపేజీ తరువాయి)** ఏర్పాటు చేశారు. మున్సిపల్ సమావేశానికి మొత్తం 13 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లలో ఛైర్‌పర్సన్ సహా ఆరుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. కోరం పూర్తయ్యేందుకు స్థానిక శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ హాజరై సమావేశాన్ని జరిపించారు. కాంగ్రెస్ నేతలు ఎవరు గత కొంత కాలంగా రగులుతున్న అసమ్మతిపై చర్చించలేదు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్‌తో పాటు మిగిలిన ఏడుగురు కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కాంగ్రెస్‌లో ఉన్న వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్‌కు సంబంధించిన ఏడుగురు కౌన్సిలర్లు కూడా హాజరు కాలేదు. హాజరైన ఆరుగురిలో ఒకరు స్వతంత్ర కౌన్సిలర్ ఉన్నారు. ఛైర్ పర్సన్ భర్త మున్సిపల్ పాలన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని అధికార విపక్ష కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలుసార్లు కౌన్సిల్ సమావేశం తేదీ నిర్ణయించిన తర్వాత వాయిదా పడింది. సోమవారం నాడు కూడా ఐదుగురు కౌన్సిలర్లు రావడంతో స్వయంగా ఎంఎల్ఏ జోక్యం చేసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఫోన్లు చేశారు. బొర్రా రాజశేఖర్, కట్టా రంగారావు తదితరులతో చర్చించారు. చివరకు స్వతంత్ర కౌన్సిలర్‌ను సమావేశానికి రప్పించి సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎల్ఏ ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నారని హాజరు కాని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఈ విషయమై పట్టించుకోలేదని వారు తెలిపారు.

**ఎట్టకేలకు జరిగిన సమావేశం :**

వైరా మున్సిపల్ సమావేశం ఎట్టకేలకు ఛైర్‌పర్సన చంద్రకళ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావడంతో ఈ విషయాన్ని ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జోక్యం చేసుకుని ఒక స్వతంత్ర కౌన్సిలర్‌ను సమావేశానికి పిలిపించి కోరం పూర్తి చేయడంతో సమావేశంలో 32 అంశాలకు సంబంధించి 31 అంశాన్ని చర్చించి ఆమోదించారు. టేబుల్ ఎజెండాగా ప్రవేశపెట్టిన నాలుగింటిలో మూడింటిని సమావేశం ఆమోదించింది.

# బైపాస్‌రోడ్డులో ఈవీ స్టేషన్‌కు భూమి పూజ



**- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన దండి, తుంబూరు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ 29వ వార్డులోని ఖమ్మంవరంగల్‌బైపాస్‌రోడ్డు సమీపంలో ఈవీ(ఎలక్ట్రికల్ వెహికల్) స్టేషన్ నిర్మాణానికై సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మంత్రి పొంగులేటి క్యాంప్‌కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ...ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అవసరమైన ఛార్జింగ్ సదుపాయాలకై మంచి పరిణామంగా పేర్కొన్నారు. తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలోనే ఏదులాపురంమున్సిపాలిటీని అగ్రగామిగా నిలపలనే మంత్రి పొంగులేటి ఆశయానికి అనుగుణంగా అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్టేషన్ నిర్వాహకులు కనకమేడల గోపాలకృష్ణయ్య, జక్కంపూడి రాము, చైర్పర్సన్ పోకబత్తిని అనిత, కౌన్సిలర్లు వెంపటి ఉమావెంకటేశ్వర్లు, బానోత్ దివ్య, కాంగ్రెస్ నాయకులు గణపారపు వీరన్న, వెంపటి సురేష్, రామిశెట్టి రమేష్, వెంపటి రవి, మోహన్‌రెడ్డి, చీకటి శ్రీను, బత్తిని యాలాద్రి, ఏపూరి తరుణ్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతితో పెరిగిన విద్యుత్ వినియోగం

**- ఖమ్మం జిల్లాలో రోజుకు 72.82లక్షల యూనిట్ల డిమాండ్,కోటా 54.4లక్షల యూనిట్లే**

**- ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎస్సీ శ్రీనివాసచారి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ గృహజ్యోతి పథకం ద్వారా ఏసీలు, కూలర్లు, వ్యవసాయ మోటార్ల వినియోగం పెరగడంతో ఖమ్మం జిల్లాలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని విద్యుత్‌శాఖ ఎస్‌సీ శ్రీనివాసచారి తెలిపారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి వినియోగం పెరిగిందని ఇది ముమ్ముందు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 30వ వార్డులో ఉన్న ఖమ్మం రూరల్ విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన ప్రజాపక్షంతో ప్రత్యేకంగా మాట్లాడారు...జిల్లాలో రోజువారి విద్యుత్ డిమాండ్ 72.82లక్షల యూనిట్లకు చేరగా సరఫరా కోటా 54.4లక్షల యూనిట్లుగా ఉందన్నారు. దీంతో రోజుకు 18.42లక్షల యూనిట్ల అదనపు అవసరం ఏర్పడుతోందన్నారు. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్‌లోడ్ సుమారు 30శాతం పెరిగిందన్నారు. గృహజ్యోతి పథకంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గడం, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏసీల వినియోగం పెరగడం, వ్యవసాయ మోటార్ల వినియోగం అధికమవడంతో డిమాండ్ పెరుగుదలకు కారణాలన్నారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నర్సింహులగూడెం, కొంగర, అనాసాగరం ప్రాంతాల్లో అధిక వినియోగం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లపై ఓవర్‌లోడ్ భారం పడుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సుమారు రూ. 80లక్షల వ్యయంతో కూసుమంచి, నర్సింహులగూడెంలో 8ఎంవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వాటి ప్లేసులో నుంచి తొలగించిన 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రాంతాల్లో అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కూసుమంచిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తు కేంద్రం అందుబాటులోకి రాబోతుందని, తిరుమలాయపాలెంలో కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఏసీలు, కూలర్లు అవసరమైన మేరకే వినియోగించాలన్నారు.అలాగే రైతులు కూడా అవసరం మేరకే వ్యవసాయ మోటార్లను ఉపయోగించి, విద్యుత్ వృథాను అరికట్టాలని సూచించారు. విద్యుత్ పొదుపు పాటించడం ద్వారా పంపిణీ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే మరమ్మత్తులు, రవాణా తదితర ఖర్చులను విద్యుత్‌శాఖే భరిస్తుందన్నారు. రైతులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైన ఈ విషయంలో డబ్బులు అడిగిన, సమస్యలపై ఏఈలు, ఏడీలు, లైన్‌మెన్లు, సిబ్బంది స్పందించకుంటే 1912లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 8712483490 నెంబర్‌కు ఫిర్యాదు చేయావచ్చునన్నారు.

# కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించండి




**ప్రజాపక్షం/కల్లూరు:** ఎలినీనో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని కల్లూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో వ్యవసాయ కూలీలకు పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి కూలీలను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి కే యం యు ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా బి కే యం యు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సిద్దినేని కరుణకుమా,ర్ ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు లు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కూలి పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా ఇబ్బంది పెడుతున్నాయని వర్షాభావ పరిస్థితులు కూలి పనులు లేక ఇబ్బందులు పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కూలీలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు వందల రోజులు పనులు కల్పించి రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలని 9 రకాల నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై ఇవ్వాలని వారానికి ఒకసారి కూల్ డబ్బులు చెల్లించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలపై ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు వారు తెలిపారు. ఈనెల 28వ తేదీ కల్లూరులో డివిజన్ రెవిన్యూ డివిజన్ స్థాయి సదస్సు నిర్వహించ బడుతుందని ఈ సదస్సుకు కల్లూరు పట్టణంలోనే కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ తో పెద్ద ఎత్తున జరిగే సదస్సును జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కల్లూరులో బతుకమ్మ బుట్టలు సిద్ధం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని మధిర రోడ్డులో కొంతమంది వ్యక్తులు బతుకమ్మ బుట్టలను తయారుచేసి కల్లూరు పరిసర మధిర, సత్తుపల్లి, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు తదితర మండలాల వారు కల్లూరు లోని మధిర రోడ్డులో తయారు చేస్తున్న వ్యక్తుల వద్ద బతుకమ్మ బుట్టలను మరియు కోలాటం కర్రలను కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. ఒక్కోబుట్ట 5000 నుంచి 15 వేల వరకు ధర పలుకుతుంది. ఇదే అదునుగా ఒకేసారి ధరలను పెంచి అదనపు ధరలతో బాదుడు బాదుతున్నారు. కల్లూరు లోని కొందరు వ్యక్తులు తయారుచేసి గత సంవత్సరం ఎవరైతే కొనుగోలు చేశారో వారు ఫోన్లను నంబర్లను తీసుకొని అమ్మేస్తున్నారు. గత 15 కొన్ని సంవత్సరాలుగా ఇదే సీజన్లో బుట్టలను అల్లి ఇతర ప్రాంతాల వారికి అమ్మి జీవనాన్ని పొందుతున్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న సుమారు పది కుటుంబాల వారు 15 రోజులు పాటు ఇదే పని మీద ఉండి వ్యాపారం చేసుకుంటున్నారు.

# అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలి

**తహశీల్దార్ కి బీకేఎంయూ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ వినతి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం సత్తుపల్లి తహశీల్దార్ పున్నం సత్యనారాయణను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు లేక కూలీలు ఇతర ప్రాంతాలకు ఆటోల్లో వలస వెళ్తున్నారని, ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కూలీలకు వారి సొంత గ్రామాల్లోనే ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రేషన్ దుకాణాల ద్వారా పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) నాయకులు రాజశేఖర్, ఒంటె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# బాలుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అరుదైన బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ తమిళనాడులోని సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 12 ఏళ్ల బాలుడు కొరకోప్పు చార్లెస్ ఫిన్నీకి పలువురు దాతలు అండగా నిలిచారు. సోషల్ మీడియా వేదికగా చేసిన విజ్ఞప్తికి స్పందించిన దాతల సహకారంతో రూ.50 వేల ఆర్థిక సాయాన్ని సమీకరించారు. పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన చార్లెస్ ఫిన్నీ తండ్రి జానకిరాముడు పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో తన కుమారుడికి అరుదైన బ్లడ్ క్యాన్సర్ సోకడంతో మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్సకు అవసరమైన ఖర్చులను భరించేందుకు కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా ఆర్థిక సాయం కోసం విజ్ఞప్తి చేశారు.ఈ విజ్ఞప్తికి స్పందించిన దాతల సహకారంతో సమకూరిన రూ.50 వేల మొత్తాన్ని ఫౌండేషన్ ముఖ్య సభ్యులు స్వయంగా బాలుడి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. బాలుడి చికిత్సకు తమ వంతు సహకారం అందించిన దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ముఖ్య సభ్యులతో పాటు చార్లెస్ ఫిన్నీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల్లో పాల్గొన్న మువ్వా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడు రోడ్డులో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో మాజీ టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు అవసరమైన కుర్చీలు, సౌండ్ బాక్సులను 1వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికులకు పది శాతం లాభాల వాటా ఇవ్వాలి

**ఈ నెల 16న హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాభాల్లో 10 శాతం వాటా చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈ నెల 16న సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం నీలం రామచంద్రయ్య భవన్‌లో జరిగిన యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కే. సూర్యం, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి తదితరులు మాట్లాడుతూ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాలను ప్రకటించకపోవడం కార్మికులను మభ్యపెట్టడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి లాభాల్లో 10 శాతం వాటాను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఆర్. మధుసూదన్ రెడ్డి, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి అమర్లపూడి శరత్, ఎం. చంద్రశేఖర్, సీవై పుల్లయ్య, రాజశేఖర్, మల్లెల వెంకటేశ్వర్లు, గోపాలరావు, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రాళ్ల బంజర్‌లో వృద్ధుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం రాళ్ల బంజరులో వృద్ధుడు దిరిశాల మంగయ్య (63) ఆదివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. వారికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలియ వచ్చింది. ఈ విషయమై భౌతిక దేహాన్ని కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# భద్రాచలం రోడ్ పేరును మార్పుచేయాలి



- కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా నామకరణం చేయాలి
- ప్రాంతీయ అస్తిత్వం ప్రతిబింబించేలా స్టేషన్ పేరుండాలి
- ఎంఎల్‌ఏ, సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును తక్షణమే మార్పు చేసి కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా మార్చాలని కేంద్రరైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజ రెలకు కొత్తగూడెం ఎంఎల్‌ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఇద్దరు రైల్వే ఉన్నతాధికారులకు సోమ వారం లేఖ పంపించారు. అనంతరం మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పూర్తిగా కొత్తగూడెం నడిబొడ్డున ఉన్నప్పటికీ భద్రాచలంరోడ్ పేరుతో పిలవడం వల్ల ప్రయాణికుల్లో తీవ్ర గందర గోళం నెలకొంటోందని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణం స్టేషన్‌కు చాలా దూరంలో ఉందని కొత్తగూడెం మాత్రమే ఈ రైల్వే సేవల ద్వారా నేరుగా అనుసంధానమై ఉందని ఆయన వివరించారు. ప్రస్తుత పేరు ఇక్కడ భౌగోళిక వాస్తవికతకు ఏ మాత్రం సరిపోవడం లేదని స్పష్టం చేశారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రజా ఆకాంక్షలను ప్రతిబింబించేలా స్టేషన్ పేరును కొత్తగూడెం రైల్వేస్టేషన్‌గా మార్పుచేయాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందన్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రజల సౌకర్యార్థం ఈ ప్రతిపాదనను పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలి

- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల
- కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎస్ ధర్నా





ప్రజాపక్షం/భద్రాచలం : ఎల్‌నినో ప్రభావంతో పాటు ప్రస్తుతం సీజన్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నా యని, భద్రాద్రికొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతాం గాన్ని ఆదుకోవాలని సిపిఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీ వ్రంగా నష్టపోయి ఆర్థికంగా నష్టాల ఊబిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేప ట్టాలని కోరారు. పత్తి, మిర్చి పంటలకు ఎకరాకు రూ.50వేలు, వరి పంటకు రూ.30వేలు, కూరగాయలు, అపరాల పంటలకు ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 24 గం.ల పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని పంట లకు బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కౌలు రైతుల సంక్షేమం కోసం 2011 చట్టాన్ని అమలు చేయాలని, స్వామినాధన్ కమీషన్ సిఫార్సుల మేరకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని వీడనాడి రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదు కోవాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను పరిష్కరించకుంటే తెలం గాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నిరసన సెగ తప్ప దని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జేసి వేణుగోపాలరావుకు ప్రతినిధి బృందం అందజేసింది. సంద్ర నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి వెంకటేశ్వర రావు సలిగంటి శ్రీనివాస్ వి పూర్ణ చంద్రరావు, వైఎస్ గిరి గుర్రం వెంక టేశ్వర్లు రంజిత్ వాడే లక్ష్మి ఇట్టి శ్రీనివాసరావు, రాజారావు ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో విస్తరిస్తున్న ఆయిల్ పామ్ సాగు

-కోతుల బెడద లేని పంటపై రైతుల ఆసక్తి
-సబ్సిడీతో మొక్కలు, నాలుగేళ్లపాటు ప్రోత్సాహకం



ప్రజాపక్షం/కారేపల్లి: సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా దీర్ఘ కాలిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ సాగుపై సింగరేణి మండల రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదేళ్ల క్రితం రైతు ముక్కా మహేశ్ ప్రారంభించిన సాగు ప్రస్తుతం మండలంలోని పలువురు రైతులకు విస్త రించింది. మండలంలో సుమారు 60 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు సమాచారం. విశ్వనాథపల్లి పంచాయితీ పరిధిలో రైతు సూరపరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సోమవారం ఉద్యానవన శాఖ, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ముదిగొండ శ్రావణి సందర్శించారు. మొక్కల పెరుగుదల, నీటి వసతి, సాగు విధానం, పంట నిర్వహణను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రభుత్వం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలను అందిస్తోందని శ్రావణి తెలిపారు. ఒక్కో మొక్క ధర రూ 193 కాగా, రాయితీతో రూ 20కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పంట సాగు చేసే అర్హులైన రైతులకు ఎకరా నికి ఏడాదికి రూ 4,200 చొప్పున నాలుగేళ్లపాటు కేంద్రం, రాష్ట్ర ప్రభు త్వాల ప్రోత్సాహకం అందుతుందని వివరించారు. రైతుల వర్గం, భూమి విస్తీర్ణం, ఇతర అర్హతలను బట్టి రాయితీలు మారుతాయని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు భూమి వివరాలు, నీటి వసతి, అర్హతలపై ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కొత్త సాగుకు వర్తించే నిబంధనలపై కూడా అధికారుల నుంచి స్పష్టత పొందాలని కోరారు.

# మణుగూరుని ఉంచుతారా..? ముంచుతారా..?

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇసుక ర్యాంపుల వలన నిత్యం కొన్ని వందల లారీలు ప్రధాన రహదారులను ధ్వంసం చేస్తూ ప్రయాణిస్తుంటే ఆ దుమ్ము, ధూళి వలన మణుగూరు ప్రజలు ఆస్తి నష్టం ఆరోగ్య నష్టంతో అనేక రకాల ఇబ్బందు లను ఎదుర్కొంటున్నారని మణుగూరు బీఆ ర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపిస్తూ సోమవారం నిరసన ప్రదర్శన నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక ర్యాంపుల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న గుత్తేదారులు కనీసం ప్రధాన రహ దారిపై వాట ర్ ట్యాంకర్లతో నీళ్ల కొట్టించకపోవడం ప్రజల పట్ల ప్రజల ప్రాణాల పట్ల వారికి ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తుంది అన్నారు. ఇసుక ర్యాంపుల వలన అనేక ప్రమా దాలు జరిగి పదుల సంఖ్యలో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నా అధికార పార్టీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి నిర్వాహకులకు బీఆర్ఎస్ పార్టీ తరఫున హెచ్చరిస్తూ లారీలు తిరుగుతున్న ప్రాంతంలో నిత్యం వాటర్ ట్యాంకర్లతో వాటర్ కొట్టించాలని, ధ్వంసమైన రోడ్లను బాగు చేయించాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరస నలు మరియు సంబంధిత ఇసుక ముట్టడి చేపడతామని తెలిపారు.

# ప్రకాశం ఖని ఓసీ-2 వద్ద రోడ్డు ప్రమాదం



ప్రజాపక్షం/మణుగూరు: ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్2 సమీ పంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని కేబుల్‌మెన్ పొట్టయ్య, కాంట్రాక్ట్ కార్మికుడు రాజేష్ గాయపడ్డారు. విధులు ముగించుకుని వస్తున్న పొట్టయ్య వాహనాన్ని, సెకండ్ షిఫ్ట్‌కు వెళ్తున్న రాజేష్ వాహనం ఢీకొట్టినట్లు తోటి కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సింగరేణి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించా లని వైద్యులను కోరారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉంది.

# అనుమానాస్పదంగా యువకుడు మృతి



ప్రజాపక్షం/ఖమ్మం : కరకగూడెం మండలం లోని కలవల నాగారం గ్రామానికి చెందిన బాదా వత్ రవిచంద్ర (28) అనే యువకుడు అనుమా నాస్పద పరిస్థితుల్లో సోమవారం తెల్లవారుజా మున మృతి చెందిన స్థితిలో కనబడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రవి చంద్రను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని స్థానికులు, బంధువులు బలంగా అను మానిస్తున్నారు. మృతుడి మెడకు బెల్ట్ చుట్టి ఉండటాన్ని గమనించిన బంధువులు, గొంతు నులిమి హత్య చేసి ఉంటారని అనుమానించి స్థానికులు ఇచ్చిన సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణు గూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణ ఘటనకు నిరసనగా మృతుడి బంధువులు, గ్రామస్థులు కరకగూడెం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. హంతకులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పోలీస్ వారికి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు, సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నట్లు తెలుస్తోంది. హత్యకు దారితీసిన పూర్తి వివరాలు, కారణాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

# స్వామి వారి సన్నిధిలో ఘనంగా ఏకాదశి రుద్రాభిషేకం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరు పతిగా పేరుగాంచిన స్వయంభు జమలా పురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవ స్థానం నందు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా సోమవారం ఏకాదశి రుద్రా భిషేకం నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి నిత్య అర్చనలు, అనుష్ఠానములు, హోమాలు, మండపారాధనలు నిర్వహిం చారు. ఉదయం 10గంటలకు స్వామి వారి సన్నిధిలోని శివాలయం నందు ఏకాదశి రుద్రాభి షేకం నిర్వహించారు. అలాగే హోమాలు, తదితర ప్రత్యేక పూజలు ప్రధానార్చకులు, వేదపండి తుల ఆధ్వర్యంలోశాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమ వారం అమ్మవారు గాయత్రీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సుమారు 400మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, మూర్తి వెంకటరమణ, రఘురామకృష్ణ శాస్త్రి, రాజీ వ్‌శర్మ, వేద పండితులు, ఇతర ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఉండాలి

- అర్హులందరికీ త్వరలో కార్డుల మంజూరు





ప్రజాపక్షం/ముదిగొండ: గ్రామంలోని గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూ రు చేయాలని గౌడ సంఘం పెద్దల విజ్ఞప్తి మేరకు అబ్కారీ శాఖ అధికారులు స్పందిం చారు. ఈ మేరకు సోమవారం కొండపల్లి అబ్కారీ శాఖ ఎస్సై వెంకన్న చందు ఆధ్వ ర్యంలో అధికారులు ముదిగొండ గ్రామాన్ని సందర్శించి, గుర్తింపుకార్డులు లేని యువ గీత కార్మికుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా కార్డులు లేని యువకులతో తాటి చెట్లు ఎక్కించి, గీత కార్మిక వృత్తిలో వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. అర్హులందరి వివరాలను నమోదు చేసుకుని తొందరలోనే గుర్తింపు కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం అబ్కారీ శాఖ ఎస్సై మాట్లాడుతూ..తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే ప్రతీ గీత కార్మికుడికి గుర్తింపు కార్డులు ఉండటం అవసరమని, వృత్తి నిర్వాహణలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోయి గాయాల పాలైనా, ప్రాణ నష్టం జరిగినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందే ప్రమాద బీమా, ఎక్స్‌గ్రే షియా, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు గుర్తింపు కార్డులు ఉపయోగపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు మల్లారపు వేలాద్రి, మల్లారపు శ్రీనివాస్, యువ నాయకుడు మల్లారపు ఉపేందర్, బుర్ర శ్రీనివాస్, బూరుగు శ్రీను, బుర్ర ధర్మయ్య, బుర్ర వీరబాబు, నాయిని వెంకటేశ్వర్లు, మల్లారపు వెంకటేశ్వర్లు, మల్లారపు రోశయ్య, గంధసిరి గోపయ్య, బుర్ర సాయి, అబ్కారీ శాఖ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించండి.. పని రోజులు పెంచండి

**-ఎల్‌నినో ప్రభావంతో వట్టిపోతున్న ఉపాధి**
**-బికెఎంయు వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో పరిస్థితులు దయనీయంగా మారాయని వ్యవసాయ కార్మికులకు ఉపాధి దొరకడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్‌లు తెలిపారు. సోమవారం ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు వినతి పత్రం సమర్పించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు దొరకడం లేదని గ్రామీణ ప్రాంత కూలీలు ఉపాధి కోసం ఆటోలపై 30 నుంచి 60 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తున్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. విబిజి రాంజీ పథకం పనులను తక్షణం ప్రారంభించి పని దినాలను పెంచడంతో పాటు మారిన పరిస్థితులకు అనుగుణంగా కూలీ ధరలు పెంచాలని వారు వినతి పత్రం లో పేర్కొన్నారు. ఖమ్మంజిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ పనులు జరగడం లేదని అతి తక్కువ వర్షాపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం కూడా ఒకటని వారు వినతి పత్రంలో తెలిపారు. దూర ప్రాంతాలకు కూలీ కోసం వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మహిళా కూలీ ఆటో ప్రమాదంలో మృతిచెందడంతో పాటు పలువురు గాయపడ్డారని వారు తెలిపారు. కేవలం నర్సరీలలో మాత్రమే ఉపాధి పనులు చేపడుతున్నారని మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనులను ఎంపిక చేసి ఉపాధి కల్పించాలన్నారు. పని రోజులను 200లకు పెంచాలని కనీస వేతనం రూ. 600లకు గిట్టుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులతో సమీక్ష చేస్తామని, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, నాయకులు మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, గోగుల ఆదినారాయణ పాల్గొన్నారు.

# ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి

**-ప్రజావాణిలో కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు పి శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ముదిగొండ మండలం మల్లన్నపాలెంకు చెందిన ఎస్‌కె జాన్‌బీ తన సదరం సర్టిఫికెట్‌లో తప్పుడు వివరాల కారణంగా పింఛన్ నిలిచిపోయిందని తిరిగి పింఛన్ మంజూరు చేయాలన్నారు. పిడిఎస్‌యు అధ్యక్షులు లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్‌కె ఆఫ్సానా తాను ఎంబిఏ పూర్తి చేశానని తనకు ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వేంసూరులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం..!

**-రాత్రింబవళ్లు కరెంటు కష్టాలు..**
**పట్టించుకునే నాథుడే లేడా?**
**-తరచూ విద్యుత్ అంతరాయాలతో ప్రజల అవస్థలు**
**-అధికారులు స్పందించేదెప్పుడు?**



**ప్రజాపక్షం/వేంసూరుః** వేంసూరు మండలంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిన సంబంధిత అధికారులు ఈ సమస్యపై ఎప్పుడు దృష్టి సారిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

### కరెంటు కోతలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు...

విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో, తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. గృహ అవసరాలకు ఆటంకం కలగడంతో పాటు విద్యార్థుల చదువులు, చిన్న వ్యాపారుల పనులు కూడా ప్రభావితమవుతున్నాయి. రోజువారీ పనులకు విద్యుత్‌పై ఆధారపడే ప్రజలు తరచూ అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నారు.

### అధికారులు స్పందించేది ఎప్పుడు?

మండలంలో విద్యుత్ సరఫరాలో పదేపదే అంతరాయాలు ఎందుకు ఏర్పడుతున్నాయి? సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉంది. సమస్యకు గల కారణాలను గుర్తించి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మహాలక్ష్మమ్మ ఆలయ పునప్రతిష్ఠ





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం గోకవరంలో 400 సంవత్సరాల క్రితం పురాతన మహా లక్ష్మమ్మ ఆలయాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు భక్తులు ఆధ్వర్యంలో సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు తన సొంత గ్రామంలో నిర్వహించే శుభకార్యానికి పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి మహేందర్ రెడ్డి దంపతులు ఆలయ కమిటీ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మమ్మ విగ్రహ పున ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కోటపాటి వీరభద్రరావు, బొమ్మ రామకృష్ణ, తీవ్రవాసుదేవ రావు, కోటపాటి శివాజీ, మార్త వెంకటేశ్వర్లు లతోపాటు బిజెపి జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, మారుతి కోటేశ్వరరావు, మారుతి వెంకటేశ్వర్లు, కట్ట వెంకటేశ్వర్లు తోపాటు గోకవరం, రామకృష్ణాపురం, నారాయణపురం, ఎర్ర బంజర, తదితర గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాప్రస్థానం పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలోని స్మశానవాటికలో మహాప్రస్థానం ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న సర్వే పనులను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. మహాప్రస్థానం బౌండరీ ఏర్పాటుకు సంబంధించిన సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. మహాప్రస్థానం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమం అని, ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయం అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీపాలశెట్టి వెంకటరావు, షేక్ రషీద్దీర్, నకిరికంటి రాజేశ్వరి, మున్సిపాలిటీ మేనేజర్ సర్వేయర్లు చక్రి, సువర్ణ, అలాగే కంటి రామకృష్ణ, అల్లడి గోపాలరావు, గోవిందు, జాని, రాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వరికి బదులుగా అపరాల సాగు వైపు మొగ్గు చూపాలి

**మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్**



**ప్రజాపక్షం/వైరాః** ఎల్‌నినో పరిస్థితుల నేపద్యంలో రైతులు రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంట సాగుపై ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని వ్యవసాయ శాఖమంత్రి సూచించారు. సోమవారం వైరాలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వాటి ప్రభావాలు, రానున్న సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మండల స్థాయి అధికారులు ఎల్‌నినో పరిస్థితులు యాసంగి సాగుపై చర్చించారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉన్నప్పటికీ, యాసంగి పంటల సాగుకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని అధికారులు రైతులకు వివరించారు. ఈ నేపద్యంలో నీటి వినియోగం తక్కువగా ఉండే అవపరాల పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మొక్కజొన్న, వరి పంటల సాగుకు బదులుగా అపరాల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని అధికారులు తెలిపారు. సాగుకు అవసరమైన నీటి లభ్యతను ముందుగా అంచనా వేసుకోకుండా పంటలు వేసి ఆ తర్వాత నష్టపోయే పరిస్థితి రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాల నేపద్యంలో రైతులకు ముందస్తు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ తెలిపారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు పాటించాలని సాగు నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, డిహెచ్‌ఎస్‌వో మధుసూదన్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ అనసూయ, వైరా ఏడిఏ టి.కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, ఇరిగేషన్ శాఖ డిఈ, హార్టికల్చర్ అధికారి ఆకుల వేణు, వైరా ఏవో టెక్నికల్ అనిల్, ఏఈవోలు కీర్తి, రాజేష్ పాల్గొన్నారు ప్రోగ్రెసివ్ రైతులు కొండబాల అశోక్, తాతా నిర్మలతో పాటు రైతులు కొల్లి శ్రీనివాసరావు, నల్లమోతు వెంకటేశ్వర్లు, గుడిపూడి రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

# కార్మికుల తిరుగుబాట్లతోనే సమూల మార్పులు




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** కార్మికవర్గ నాయకత్వంలో జరిగే ప్రజా తిరుగుబాట్ల ద్వారానే వ్యవస్థలో సమూల మార్పులు సాధ్యమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. హన్మేష్, కె. సూర్యం అన్నారు. సోమవారం సత్తుపల్లిలో పార్టీ రాష్ట్ర నాయకులు నాయిని రాజు, కె. కల్పన అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో వారు ప్రసంగించారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, కార్పొరేట్లకు అనుకూలంగా పాలకులు వ్యవహరిస్తూ కార్మికులు, రైతుల శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని అన్నారు. కార్మికులు, రైతులు పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షించాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కె. రమ, గుమ్మడి నరసయ్య, సీవై పుల్లయ్య, కూకలకుంట రవి, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో పుట్టిన ఆటలకు..మేలైన ఆరోగ్య బాటలు..!





-మరుగున పడుతున్న గ్రామీణ క్రీడలు
-గోళీలు, గిల్లీదండా, అష్టాచమ్మా నుంచి
కోతి కొమ్మచ్చివరకు...పల్లె ఆటలకు పునర్వైభవం వచ్చేనా
-స్మార్ట్‌ఫోన్ మోజులో కనుమరుగవుతున్న బాల్య క్రీడా సంస్కృతి

**ప్రజాపక్షం/వైరా:** ఒకప్పుడు పల్లెల్లో సాయంత్రం వేళ కనిపించే దృశ్యం ఇప్పుడు అరుదైపోయింది. పాఠశాలలు ముగిసిన వెంటనే పిల్లలు ఇంటికి పరుగెత్తడం...పుస్తకాలు పక్కన పడేయం...వీధులు, ఖాళీ స్థలాలు, చెట్ల నీడలు, పొలాల గట్ల వద్దకు చేరి ఆటల్లో మునిగిపోవడం...ప్రతి గ్రామంలోనూ కనిపించేది. గోళీలాట, గిల్లీదండా, కోతి కొమ్మొచ్చి, దాగుడుమూతలు, తొక్కుడు బిళ్ల, నాలుగు రాళ్లు, అష్టాచమ్మా, పచ్చీసు, అచ్చంగాయాలు, వామనగుంత వంటి ఆటలు పిల్లల బాల్యానికి విడదీయరాని భాగంగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పల్లె వీధుల్లో పిల్లల కేరింతలు తగ్గి..స్మార్ట్‌ఫోన్‌లలో వీడియో గేమ్‌ల శబ్దాలు పెరిగాయి. ఖాళీ స్థలాలు తగ్గిపోవడం, పట్టణీకరణ, తల్లిదండ్రుల భయాలు, చదువుపై పెరిగిన ఒత్తిడి, డిజిటల్ వినోదం అందుబాటులోకి రావంతో గ్రామీణ ఆటలు క్రమంగా కనుమరుగవుతున్నాయి.

## పల్లె ఆటల్లోనే ప్రత్యేకత

గ్రామీణ ఆటలకు ఖరీదైన క్రీడా పరికరాలు అవసరం లేదు. మ ట్టి, చిన్న రాళ్లు, గవ్వలు, చింతపిక్కలు, రెండు కర్రలు ఉంటే చాలు. పిల్లలు తమకు తామే ఆటను రూపొందించుకునేవారు. ఈ ఆటల్లో శారీరక శ్రమతో పాటు తెలివితేటలు, ఏకాగ్రత, వేగం, వ్యూహరచన, సమన్వయం వంటి అనేక నైపుణ్యాలు సహజంగానే అభివృద్ధి చెందేవి. గిల్లీదండా పిల్లల్లో వేగం, గురి, చేతి కంటి సమన్వయాన్ని పెంచేది. గోళీలాటలో ఏకాగ్రత, గురి అవసరం. అష్టాచమ్మా, పచ్చీసు, వామన గుంత వంటి ఆటల్లో ఆలోచనా శక్తి, ముందుచూపు, వ్యూహరచనకు పదును పడేది. దాగుడు మూతలు, స్తంభాలాట వంటి ఆటలు పిల్లలను చురుగ్గా కదిలించేవి.

## ఆటతో పాటు స్నేహబంధాలు

పల్లె ఆటల ప్రత్యేకత కేవలం వ్యాయామంలోనే లేదు. అవి పిల్లలను ఒకచోట చేర్చేవి. వయసుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా కలిసి ఆడేవారు. గెలుపును ఆస్వాదించడం, ఓటమిని అంగీకరించడం, ఇతరులకు అవకాశం ఇవ్వడం నియమాలను పాటించడం వంటి విలువలు ఆటల ద్వారానే అలవడేవి. ఒక గోళీ గెలిచిన ఆనందం...స్నేహితుడిని ఆటలో ఓడించిన సరదా..దాగుడుమూతల్లో దొరకకుండా తప్పించుకున్న ఉత్సాహం...ఇవన్నీ బాల్యంలో చెరగని జ్ఞాపకాలుగా మిగిలేవి.



## గ్రామీణ క్రీడాలకు గుర్తింపు అవసరం

క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి ఆధునిక క్రీడలకు పాఠశాలలు, క్రీడా సంఘాలు, ప్రభుత్వ శాఖల నుంచి ప్రోత్సాహం లభిస్తుంది. అయితే స్థానికంగా తరతరాలుగా వస్తున్న గ్రామీణ ఆటలకు మాత్రం ప్రత్యేక గుర్తింపు, నిర్వహణ వేదికలు, పోటీలు తక్కువగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో పల్లె క్రీడా నోద్సవం నిర్వహించడం, పాఠశాలల్లో స్థానిక ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించడం, మండల జిల్లా స్థాయిలో గ్రామీణ క్రీడల పోటీలు నిర్వహించడం ద్వారా ఈ ఆటలను తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకురావచ్చు. పాఠశాల వార్షికోత్సవాలు, జాతరలు, గ్రామోత్సవాలు, యువజన కార్యక్రమాల్లో గిల్లీదందా, గోళీలు, అష్టాచమ్మా తిక్కుడుబిళ్ల, కబడ్డీ వంటి ఆటలకు పోటీలు నిర్వహిస్తే పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది.

## ఖాళీ మైదానాలే కావాలి

గ్రామీణ క్రీడలకు పెద్ద స్టేడియాలు అవసరం లేదు. గ్రామీల్లోని ఖాళీ ప్రదేశాలను క్రీడా మైదానాలుగా అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల మైదానాలను సాయంత్రం వేళ స్థానిక పిల్లలు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, యువజన సంఘాలు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గ్రామంలో కనీసం ఒక చిన్న క్రీడా వేదికను ఏర్పాటు చేయడం సాధ్యమే.

## పెద్దల జ్ఞాపకాలు...పిల్లల భవిష్యత్తు

తల్లిదండ్రులు, తాతలు, నానమ్మలు తమ చిన్న నాటి ఆటలను పిల్లలకు పరిచ



యడం చేయాల్సిన అవసరం ఉంది. మేము ఆడిన ఆటలు అని చెప్పడం మాత్రమే కాకంపడా...వారితో కలిసి ఆడితే పిల్లల్లో ఆసక్తి మరింత పెరుగుతుంది. డిజిటల్ ప్రపంచాన్ని పూర్తిగా దూరం చేయడం సాధ్యం కాదు. కాని రోజులో కొంత సమయాన్ని మొబైల్‌కు దూరంగా ఉంచి ఆటలకు కేటాయించడం మాత్రం సాధ్యమే.

## పల్లె ఆటలకు పునర్వైభవం కావాలి

గ్రామీణ ఆటలు కేవలం గతాన్ని గుర్తుచేసే జ్ఞాపకాలు కావు. అవి మన స్థానిక సంస్కృతిలో భాగం, పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడే సహజనమైన సాధనాలు. ముఖ్యంగా ఎలాంటి ఖర్చు లేకుండా అందరికీ అందుబాటులో ఉండటం వాటి గొప్పతనం. అందుకే గ్రామీణ క్రీడలను కాపడటం అంటే కేవలం పాత ఆటలను కాపాడటం కాదు. మన పల్లె సంస్కృతిని, బాల్యాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కాపాడటమే. మట్టి బాటల్లో పుట్టిన ఆటలు...మళ్లీ మైదానాల్లో సందడి చేయాలి. పల్లె క్రీడలకు ప్రోత్సాహం లభిస్తే..పిల్లల బాల్యాన్ని కొత్త ఉత్సాహం వస్తుంది.

# మేడిపల్లి కాస్తా 'మేడిదపల్లి' అయింది.!




- అధికారుల బాధ్యతారాహిత్యం..కాంట్రాక్టర్ల తప్పిదాలకు నిదర్శనంగా మారిన ఓ సూచికబోర్డు
- తప్పుల తడకగా గ్రామం పేరు.. కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/ముదిగొండ:** అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల బాధ్యతా రాహిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలోనే కాకుండా, గ్రామాల పేర్లను సూచించే బోర్డుల ఏర్పాటులోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రామాల పేర్లను సైతం సక్రమంగా రాయలేని పరిస్థితి నెలకొనడం సంబంధిత శాఖల పనితీరుపై విమర్శలకు తావిస్తోంది. ముదిగొండ మండల పరిధిలోని మేడిపల్లి గ్రామం పేరు సూచికబోర్డులో 'మేడిదపల్లి'గా మారడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

### - గ్రామం పేరు రాయడంలోనూ నిర్లక్ష్యమేనా?

గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ప్రయాణికులకు దారి చూపేందుకు ఏర్పాటు చేసే సూచిక బోర్డులు ఎంతో కీలకమైనవి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, వాహనదారులు కొత్తగా గ్రామాలకు వెళ్లే వారు బోర్డుల అధారంగానే తమ గమ్యస్థానాలను గుర్తిస్తుంటారు. అలాంటి బోర్డులపై గ్రామాల పేర్లను తప్పులు లేకుండా స్పష్టంగా రాయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. అయితే మేడిపల్లి గ్రామం పేరు సూచిక బోర్డుపై తప్పుగా ముద్రించడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతోంది.

### - పరిశీలన లేకుండానే బోర్డుల ఏర్పాటు?

గ్రామాల పేర్లు, రహదారుల వివరాలు, దూర సూచిక వంటి అంశాలను ముందుగా పరిశీలించి, సంబంధిత గ్రామ పంచాయతీ లేదా అధికారుల నుంచి ధ్రువీకరించిన తర్వాతే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ బోర్డుపై ముద్రించిన పేరు సరైనదా..కాదా..అన్న విషయాన్ని కూడా పరిశీలించకుండా ఏర్పాటు చేవారా? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సినవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### - ప్రజలకు ఇబ్బందులు..అధికారులకు పట్టనట్టేనా?

సూచిక బోర్డులపై గ్రామాల పేర్లు తప్పుగా ఉండటం చిన్న విషయంగా కనిపించినప్పటికీ, గ్రామ గుర్తింపు, ప్రయాణికులకు మార్గనిర్దేశం వంటి అంశాల్లో గందరగోళానికి దారితీసే అవకాశం ఉంది. ఇలాంటి తప్పిదాలు అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే సరిదిద్దాల్సి ఉన్నప్పటికీ, బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం కనిపించడం విమర్శలకు కారనమవుతోంది. ప్రజా అవసరాల కోసం చేపట్టే పనుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు ఇలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్థానికులు కోరుతున్నారు.

### - వెంటనే సరిచేయాలని ప్రజల డిమాండ్

మేడిపల్లి గ్రామం పేరును తప్పుగా చూపిస్తున్న సూచికబోర్డును సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, సరైన పేరుతో కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా బోర్డుల తయారీ, ముద్రణ, ఏర్పాటు దశల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా, ప్రభుత్వ పనులు నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. గ్రామం పేరు సరిగ్గా రాయలేని పరిస్థితి ఉంటే పనుల నాణ్యతను ఎలా అంచనా వేయాలన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, తప్పుగా ఉన్న సూచిక బోర్డును సరిచేసి తమ బాధ్యతను చాటుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# న్యూ హెల్త్ స్కీం సమస్యను పరిష్కరించండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం సమస్యలను వెంటనే పరిష్కరించాలని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. కమిటీ సభ్యురాలిని తొలగించి విశ్రాంత పోలీస్ అధికారులకు న్యాయం చేయాలని కోరారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకట నారాయణ లు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కమిటీ సభ్యురాలు ఉమారెడ్డి వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సమీక్ష జరపాలని ప్రైవేటు ఆసుపత్రులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలని వారు కోరారు. పోలీస్ శాఖకు సంబంధించిన పాత బకాయిలు చెల్లించడం లేదని వైద్యం చేసేందుకు నిరాకరిస్తున్నారని దీనిపై సంఘ సభ్యులు పలువురు ఫిర్యాదు చేశారని వారు తెలిపారు. నగదు రహిత వైద్య సేవలు పొందెందుకు ఎదురవుతున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని , పోలీస్ శాఖకు సంబంధించిన పెండింగ్ బకాయిలను పరిష్కరించి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు.

# లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు నివారించండి

-కలెక్టర్‌కు సిపిఎం వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలని ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరింది. ఈ మేరకు కలెక్టర్ దివాకర టిఎస్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల వ్యవహారం శృతి మించిందని లబ్దిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని సహించబోమన్నారు. సర్పంచులను కాదని కాంగ్రెస్ నాయకులు లబ్దిదారులను ఎలా ఎంపిక చేస్తారని ఆయన ప్రశ్నించారు. రాజకీయ జోక్యంతో అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందని నున్నా తెలిపారు. లబ్దిదారులకు అన్యాయం జరిగితే ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని ఆయన తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణ, మదుపల్లి గోపాలరావు, బషీర్, చింతలచెరువు కోటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు ఉన్నారు.

# ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ విజయోత్సవ ర్యాలీ







ప్రజాపక్షం/మధిర: తెలంగాణ ఆర్‌టిసి గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించిన సందర్భంగా సోమ వారం మధిర డిపో వద్ద విజయోత్సవ ర్యాలీ , విజయోత్సవ సభ నిర్వ హించడం జరుగుతుంది. ఈ విజయం ఆర్‌టిసి కార్మికుల ఐక్యతను, ఎంప్లాయిస్ యూనియన్ నిరంతర పోరాటాలకు, కార్మికుల హక్కులు, సంక్షేమం పట్ల యూనియన్‌కు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎంప్లా యిస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరిం చిన కార్మిక సోదర సోదరీమణులకు, యూనియన్ నాయకులు, కార్య కర్తలకు సిపిఐ నాయకులకు, ఏఐటియుసి నాయకులకు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులకు, కార్యకర్తలకు, యూనియన్ అభిమానులకు సానుభూతి పరులకు ఎంప్లాయిస్ యూనియన్ తరుపున హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తిమ్మినేని రామారావు మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక సమ స్యల పరిష్కారం , ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, మాస్టర్ పే స్కేల్ అమలు, పిఆర్‌సి పెండింగ్ సమస్యల పరిష్కారం, రిటైర్డ్ ఉద్యో గుల సమస్యల పరిష్కారం , ఉద్యోగ భద్రత, కార్మికుల సంక్షేమం కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని నాయ కులు తెలిపారు. ఎన్నికల్లో కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిల బెట్టుకుంటూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ విజయాన్ని కార్మికుల హక్కుల సాధ నకు మరింత బలమైన పునాదిగా మలుచుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో మధిర డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యద ర్శులు ఎం.వెంకటేశ్వర్లు, షేక్ నాగుల్‌మీరా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరు ణకుమారి, సహాయ కార్యదర్శి రామచంద్రరావు, ఎంప్లాయిస్ యూని యన్ నాయకులు వి.రామకృష్ణ, సత్యనారాయణ, హరికృష్ణ, అబ్బాస్ మియా, సాయికుమార్, రాధిక, కృపాదేవి, శ్యామ్‌బాబు, రామారావు, మధిర డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఆర్‌టి.రావు, ఎస్సీ, ఎస్టీ అసోసి యేషన్ నాయకులు గోపాలరావు, ఎలియాన్ ఏఐటియుసి నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజ యోత్సవ ర్యాలీని మహాసభను విజయవంతం చేశారు.

# డిహెచ్‌పిఎస్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

**దళితులపై దాడులను ఖండించాలి : యంగల**



ప్రజాపక్షం/మధిర: డిహెచ్‌పిఎస్ రాష్ట్ర విస్తృత సమావేశం అక్టోబర్ 13న సిపిఐ రాష్ట్ర కార్యాలయం హిమాయత్ నగర్ హైదరాబాద్‌లో జరుగుతుందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. డిహెచ్‌పిఎస్ మధిర మండల సమావేశం సోమ వారం మధిర ఆర్‌టిసి మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశా నికి కొందూరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరు గుతున్న దాడులను వివక్షత సామాజిక అనిచివేతకు వ్యతిరేకంగా రానున్న కాలంలో మరిన్ని ఉద్యమాలకు మరింత విస్తృతంగా నిర్వహిం చాలని, ఆ వైపున దళిత ఉద్యమాలు బలోపేతం చేయాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల సమస్యలపై మరింత ఉద్యమాల ద్వారా వారి సమస్యల పరిష్కారం వైపు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందని దళితులపై దాడులు జరిగిన ప్రతి సందర్భంలో బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసు కోవడంలో పాలక ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలో రిజర్వే షన్లు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభు త్వాల వైపున ఆలోచన చేయాలని ప్రైవేట్ రంగాల్లో కూడా రిజర్వే షన్లు అమలు చేయాలని సామాజిక న్యాయం సాధించడానికి విద్య ఉపాధి ఆర్థిక రంగాల్లో దళితులకు సమాన అవకాశాలు కల్పించాలని దళిత విద్యార్థులు యువత ఎదుర్కొంటున్న విద్య ఉపాధి సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధం చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మహిళ లపై కొనసాగుతున్న వివక్షత హింస సామాజిక అణిచివేతకు వ్యతిరే కంగా మహిళా భాగస్వామ్యాన్ని పెంచుతూ కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య సామాజిక న్యాయ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసి పెరుమాళ్ళ పల్లి ప్రకాశరావు, తలారి రమేష్, కంటెపూడి దేవదానం, జిల్లా నాయ కులు మాతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# బౌద్ధ ఉత్సవానికి వేళాయె..!



**-ప్రపంచ శాంతి ర్యాలీకి ఏర్పాట్లు**
**-బతుకమ్మలతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు**
**-విదేశీయులు 15 మంది ప్రత్యేక పూజలు**

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రం లోని దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్దదైన బౌద్ధక్షేత్రం వద్ద బౌద్ధ ఉత్సవాల కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆధ్యాత్మిక శోభ ను సంత రించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ధమ్మ పద బుద్ధ విహార చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బౌద్ధ ఉత్సవాలు నిర్వహిం చనున్నారు. ప్రపంచ శాంతి, మైత్రి, కరుణ నినాదంతో ఉత్సవం ను నిర్వహించేందుకు నిర్వహకులు చర్యలు చేపట్టారు. థాయ్లాండ్, కొలంబోడియా, బర్మా దేశాల తో పాటు ఇండియా కు చెందిన బౌద్ధ భిక్షువులు మొత్తం 15 మంది ప్రపంచ శాంతి ర్యాలీ లో పాల్గొంటు న్నారు. ఉదయం 9:30 గంటలకు స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి బౌద్ధక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. కాగా విదేశీయులకు తెలంగాణ సాంప్రదాయం కు ప్రతీకగా ఉన్న బతుకమ్మలతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు బంతే సిద్ధా రక్షితా తెలి పారు. 9.30 కు ర్యాలీ, 10.30 లకు ప్రత్యేక పూజ కార్యక్రమం, 11.30 లకు వేదిక నుంచి ప్రవచనాలు, 11.50 సన్నదానం. 11.45 లకు ముగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీ 1 లో కింగ్ బుద్ధ హాలీవుడ్ సినిమా దర్శకుడు, నటుడు సత్యారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉత్సవాల అనంతరం ప్రపంచ దేశాలలో బౌద్ధక్షేత్రం కు తగిన గుర్తింపు వస్తుందని నిర్వాహకులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాలను నిర్వహించేందుకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి జిల్లా యంత్రాంగం కు బాధ్యతలు అప్పగించి, బౌద్ధక్షేత్రం ను సర్వసుందరంగా తీర్చి దిద్దేందుకు సహకరిస్తు ప్రతి ఒక్క రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లు ను జిల్లా టూరిజం అధి కారి సుమన్ చక్రవర్తి, తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు లు స్వయంగా పర్యవేక్షించారు.

# ఇన్సాఫ్ నగర అధ్యక్షునిగా యాకూబ్

**కార్యదర్శిగా మజీద్**



ప్రజాపక్షం/ ఖమ్మం : తన్జీమ్ ఎ ఇన్సాఫ్ నగర గౌరవ అధ్యక్షులుగా మహ్మద్ మసీయుద్దీన్, అధ్యక్షులుగా నిజాంపేట యాకూబ్, ఉపాధ్యక్షు లుగా ఎండి జాకీర్, సైదాబేగం లు ఎన్నికయ్యారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన నగర మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎండి మజీద్, సహాయ కార్యదర్శులుగా మహబూబ్‌పాషా, జకీయా, ఎస్‌కె చాన, బేగం, నూర్జన్, ప్రచార కార్యదర్శిగా అక్రం లు ఎన్నికయ్యారు. ఖమ్మంలో వన్‌టౌన్, త్రీటౌన్, టూ టౌన్, ఖానాపురం హవేలీకి ప్రత్యేక కమిటీలను ఎన్నుకు న్నారు. వన్‌టౌన్ అధ్యక్షులుగా యాకూబ్, టూటౌన్ అధ్యక్షులుగా ఎస్‌కె చాన, త్రీటౌన్ అధ్యక్షు లుగా షరీఫ్, ఖానాపురం హవేలీ కమిటీ అధ్యక్షులుగా అక్రం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలాం మాట్లాడుతూ ముస్లింల సంక్షేమ పథకాల కోసం నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ముస్లింలపై జరుగుతున్న దాడులను నివారించే దుకు, ముస్లిం సమాజాభివృద్ధికి కృషి చేయాలని నూతన కమిటీని కోరారు.

# నూతన బస్టాండ్‌లో రెస్ట్ రూమ్ ఏర్పాటు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నూతన బస్టాండ్‌లో సిబ్బంది సౌకర్యార్థం రెస్ట్ రూమ్ ఏర్పాటు చేశారు. నైట్ అవుట్, దూర ప్రాంత సర్వీసులకు సంబంధించిన సిబ్బంది రెస్ట్ తీసు కోవడానికి 24 బెడ్స్‌తో రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించారు. ఇట్టి విశ్రాంతి గదుల్లో ప్రతి రోజు సుమారు 20 మంది కండక్టర్లు, డ్రైవర్లు సేద తీరుతున్నారు. రెస్ట్ రూమ్‌లో సిబ్బంది సౌకర్యార్థం, ఫ్యాన్లు, జంబో కూలర్లను సైతం ఏర్పాటు చేశారు. సిబ్బందికి చక్కటి విశ్రాంతి, మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ఆర్‌ఎం సరిరామ్ ఆదేశాను సారం రెండు ఏసిలను కూడా ఏర్పాటు చేశారు. ఇట్టి సదుపాయాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

# మూడు చక్రాల స్కూటీ ఇవ్వండి సారూ...!

**-ఏడాది నుంచి తిరుగుతున్న దయచూపండి**
**-ప్రజావాణిలో దివ్యాంగులు గోడు**




ప్రజాపక్షం/నేలకొండపల్లి : మూడు చక్రాల స్కూటీ ఇకనైనా ఇవ్వండి సారూ అంటూ, దివ్యాంగులు ఎంపీడీఓ వద్ద గోడు వినిపించారు. మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి లో పైనంపల్లి గ్రామానికి చెందిన మల్లేల రమాదేవి, అప్పల నరసింహాపురం గ్రామానికి చెందిన పేరాల స్వామి అనే దివ్యాంగుల కు ఏడాది క్రితం మూడు చక్రాల స్కూటీ మంజూరు చేశారు. వివిధ సాంకేతిక కారణాల వలన పంపిణీ చేయకుండా జాప్యం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇవ్వలేదని గోడు వినిపించారు. తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పీ.వీ.చలమయ్య ఆధ్వర్యంలో మండల అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన ఎంపీడీఓ యం.యర్రయ్య సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. త్వరలోనే అందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి లో పలు గ్రామాలకు చెందిన వివిధ సమస్యల ను అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెండు మోటార్ సైకిల్స్ ఢీ

**కేబుల్ మాన్, కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్ర గాయాలు**



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కాలరీస్ మణుగూరు పీకేఓసి 2 రహదారిలో దుర్గ ఓబి క్యాంప్ ఆఫీస్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిల్స్ ఢీకొనడంతో పీకే ఓ సి 2లో పనిచేస్తున్న కేబుల్ మాన్ యు పొట్టయ్య, కాంట్రాక్ట్ కార్మికుడు సందీప్ తీవ్ర గాయపడ్డారు, వీరిని హుటాహుటిన స్థానిక సింగరేణి ఏరియా హాస్పిటల్ కి వైద్య సహాయం కొరకు తరలించారు. పొట్టయ్యకు ముఖానికి గాయాలు కాగా, రాజేష్ కి కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న ఏఐ టియుసి నాయకత్వం ఏఐటియుసి నాయకులు హుటాహుటిన హాస్పిటల్ కు చేరుకొని తీవ్రంగా గాయపడిన వారిని పరామర్శించారు. వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సహాయం అందజేయా లని డివై సిఎంఓ జ్యోతిర్మయి ని కోరడం జరిగింది. గాయాల బారిన పడ్డ ఇద్దరు కార్మికులను రెండు వేరు వేరు అంబులెన్స్ లలో మెరుగైన వైద్య సహాయం కొరకు కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ కి పంపించారు. ఏఐటియూసి బ్రాంచ్ నాయకులు వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య, జీఎం కమిటీ మెంబర్ ఆవుల నాగరాజు, పికే ఓసి టు పిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి, సేఫ్టీ కమిటీ మెంబర్ నాగుల సతీష్ తదితరులు పరిస్థితిని పర్యవేక్షించారు.

